


Digital, tmedia.net.in

# టీ-మీడియా

tmedia.net.in

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఆదివారం ఆగస్టు 09, 2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

# మీతో మీకే నిజమైన పోటీ

## ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ



**టి మీడియా ,ఆగస్టు 8 , ఢిల్లీ బ్యూరో :** ఇండియన్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిధిగా ప్రధాని మోదీపాల్గొన్నారు. సుమారు 3 వేల మందికిపైగా విద్యార్థులు ఈ ఈవెంట్‌కు హాజరయ్యారు. దీంట్లో 587 మంది పీహెచ్‌డీ స్కాలర్లు ఉన్నారు. వారికి డిగ్రీ పట్టాలను అందజేశారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ.. పరం ప్రాగ్యా .. హై పర్ఫార్మెన్స్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సూపర్‌కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఐఐటీ ఢిల్లీ సోనిపేట్ క్యాంప్‌లో ఈ సెంటర్‌ను ఆవిష్కరించారు. అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్, భారత టెక్నాలజీ రంగంలో ఏఐ ప్రాముఖ్యతను తెలిపారు. విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీని వీడుతున్న విద్యార్థులకు ఆయన కంగ్రాట్స్ చెప్పారు. విద్యార్థుల కుటుంబాలు, టీచర్లు, మెంటర్లను ఆయన మెచ్చుకున్నారు. డిగ్రీలతోనే కాదు, ఎంతో అనుభవం విద్యార్థులు వర్సిటీని వీడుతున్నట్లు ప్రధాని తెలిపారు.

ఐఐటీలో చదువుకోవడం వల్ల.. సంక్లిష్టమైన సమస్యలను పరిష్కరించే సామర్థ్యం విద్యార్థులకు వచ్చినట్లు చెప్పారు. దేశానికి సేవ చేయాల్సిన బాధ్యత కూడా ఆ విద్యార్థులపై ఉందని ప్రధాని పేర్కొన్నారు. కోవిడ్19 మహమ్మారి వేళ జరిగిన ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్నానని, ఇప్పుడు భౌతికంగా ఇక్కడకు రావడం సంతోషంగా ఉందన్నారు. సాంకేతిక రంగంలో చాలా విప్లవాత్మక రీతిలో మార్పులు జరుగుతున్నాయని, రాబోయే 20 నుంచి 30 ఏండ్లలో ప్రపంచం (మిగతా 2లో)

# తెలంగాణ ప్రజలకు భారీ గుడ్ న్యూస్

## ప్రభుత్వం నుంచి మూడు శుభవార్తలు



**టి మీడియా ,ఆగస్టు 8 , హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణలోని ప్రజలకు గుడ్ న్యూస్. రేవంత్ సర్కార్ ఆగస్ట్ 15న ట్రిపుల్ బొనాంజా అందించనుంది. ఒకేసారి ప్రజలకు ప్రయోజనం చేకూర్చే మూడు కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనుంది. కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు, కొత్త పింఛన్ల పంపిణీతో పాటు గిగ్ వర్కర్ల కోసం సంక్షేమ చట్టాన్ని అమల్లోకి తీసుకురానుంది. ఈ మూడు కీలక కార్యక్రమాలను ఆగస్ట్ 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రారంభించనుంది. వీటి వల్ల రాష్ట్రంలో కోట్లాది మంది ప్రజలు లబ్ధి పొందనున్నారు. సీఎం రేవంత్ చేతుల మీదుగా ఈ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. వీటి వివరాలు ఇప్పుడు చూద్దాం.

**క్యూఆర్ కోడ్‌తో కొత్త స్మార్ట్ కార్డులు**

తెలంగాణలోని రేషన్‌కార్డుదారులందరికీ కొత్త స్మార్ట్ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేయనుంది. హైదరాబాద్‌లో ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ ప్రారంభించనుడండగా.. నియోజకవర్గాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు పంపిణీ చేయనున్నారు. ఈ స్మార్ట్ కార్డులపై క్యూఆర్ కోడ్‌తో పాటు లబ్ధిదారుల అడ్రస్, పేర్లు ఉంటాయి. ఇక సీఎం రేవంత్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటోలు ఉంటాయి. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారుల వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. ఇక కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక (మిగతా 2లో)

# మహిళా రిజర్వేషన్లకు షరతులెందుకు?





**● రాహుల్, రిజిజు మధ్య మాటల యుద్ధం**

**టి మీడియా ,ఆగస్టు 8 , ఢిల్లీ బ్యూరో :** మహిళా రిజర్వేషన్ల అమలుపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ ఎలాంటి షరతులు లేకుండా మద్దతు ఇవ్వాలని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ఎంపీ రాహుల్ గాంధీ గట్టిగా స్పందించారు. మహిళలకు శాసనసభల్లో రిజర్వేషన్లు కల్పించే 2023 నాటి చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలును లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అయిన డీలిమిటేషన్‌తో ఎందుకు ముడిపెడుతున్నారని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు.

పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా ఈ విషయం తనకు మరింత బాగా తెలిసి ఉండాలని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. 2023లో పార్లమెంటు ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టానికి కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించే సమయంలో కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టంగా వెల్లడించిందన్నారు. అయితే చట్టం ఆమోదమై దాదాపు మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు దాని అమలును డీలిమిటేషన్‌తో అనవసరంగా ముడిపెట్టాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. 2023 నాటి చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా అమలు చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

**అసలేం జరిగిదంటే?**

మహిళా శక్తి గురించి రాహుల్ గాంధీ మాట్లాడిన వీడియోను కాంగ్రెస్? ఎక్స్?లో విడుదల చేసింది. అందులో భారత మహిళల శక్తి బందీగా ఉండిపోయిందని, రాజకీయాలు, వ్యాపారాల్లోనే కాదు, సొంతింట్లో కూడా తమను తాము వ్యక్తపరచుకునే అవకాశం దొరకట్లేదని అన్నారు. కనీసం ఊహించుకునే స్వేచ్ఛ లేదని, వీధుల్లో సౌకర్యవంతంగా నడవలేకపోతున్నారని పేర్కొన్నారు. మహిళలు తమను తాము వ్యక్తపరచుకోలేని ఏ దేశమూ విజయం సాధించలేదని భావిస్తున్నట్లు చెప్పారు. మహిళల భాగస్వామ్యం లేకపోతే, వారి గళం వినిపించే అవకాశం రాకపోతే, మన దేశం (మిగతా2లో)

# కేసీఆర్ నాయకత్వంలో మరో తెలంగాణ ఉద్యమం



**● మీడియాతో కేటీఆర్ ఇష్టాగోష్టి**

**టి మీడియా ,ఆగస్టు 8 , హైదరాబాద్ బ్యూరో :** హైదరాబాద్‌లో ఇండస్ట్రియల్ ఏరియాల్లోని భూములను మల్టీ పర్పస్ జోన్లుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్) పాలసీ మీద సెప్టెంబర్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. 10 వేల ఎకరాల భూమిని ఎవరికో ధారాధత్తం చేసే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఈ విధానంపై ఇండస్ట్రియల్ అసోసియేషనర్లకు లేఖ రాస్తానని తెలిపారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రాగానే ఈ పాలసీని రద్దు చేస్తామని స్పష్టం చేశారు. పరిశ్రమ కోసం ఇంకోచోట భూమి ఇస్తున్నప్పుడు ఈ భూమిని ప్రభుత్వమే తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇవాళ మీడియాతో ఇష్టాగోష్టిలో మాట్లాడిన ఆయన హిల్ట్ పాలసీ కింద చెల్లింపులు చేసేవారు ఆర్థిక నష్టాన్ని చవిచూస్తారని హెచ్చరించారు. పారిశ్రామికవేత్తలు భూ మాఫియాతో కుమ్మక్కు కావొద్దని విజ్ఞప్తి చేశారు.

**'కేసీఆర్ చేసినన్ని యాగాలు మరెవరూ చేయలేదు'**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసినన్ని యాగాలు మరెవరూ చేయలేదని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు నిర్వహిస్తున్న వరుణ యాగాలు సహా వివిధ అంశాలపై ఆయన (మిగతా 2లో)

# అమెరికా జాబ్ మార్కెట్ డీలా

**● ఒక్క జులైలోనే 23,000 మంది లేఆఫ్**

**టి మీడియా ,ఆగస్టు 8 , ఢిల్లీ బ్యూరో :** అమెరికా మధ్యంతర ఎన్నికలకు మూడు నెలల ముందు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు షాక్ తగిలింది. ఈ ఏడాది జులైలో అమెరికా ఉద్యోగ మార్కెట్ డీలా పడింది. ఏకంగా 23,000మంది తమ ఉద్యోగాలను కోల్పోయారు. ఈ విషయం అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌నకు రాజకీయంగా ఇబ్బందికర అంశం కానుంది.

**యూఎస్ కార్మిక శాఖ ప్రకారం**

అమెరికా జాబ్ మార్కెట్ ఈ ఏడాది మే, జూన్ నెలల్లో 1,03,000 ఉద్యోగాలను కోల్పోయింది. జులైలో 23,000 మందిని కంపెనీలు ఉద్యోగాల నుంచి తొలగించాయి. అయితే జులైలో నిరుద్యోగిత రేటు తగ్గింది. అందుకు కారణం వేలాది మంది జాబ్ మార్కెట్ నుంచి వైదొలగడం, ఉద్యోగాల కోసం పోటీపడే వారి సంఖ్య తగ్గడమని కార్మిక శాఖ వెల్లడించింది. కాగా, అమెరికా మధ్యంతర ఎన్నికలలో కాంగ్రెస్‌పై పూర్తి పట్టును (మిగతా 2లో)






# తెలంగాణ ప్రజలకు భారీ గుడ్ న్యూస్

(మొదటి పేజీ తరువాయి)
కొత్త పింఛన్లను ఇప్పటివరకు మంజూరు చేయలేదు. అయితే ఆగస్ట్ 15వ తేదీ నుంచి అర్హులైనవారికి కొత్త పింఛన్లను మంజూరు చేయనున్నారు. ఇప్పటికే అర్హులైనవారి నుంచి ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. వారిలో అర్హులను గుర్తించి లబ్దిదారుల జాబితాలో చేర్చింది. పింఛన్ సొమ్మును నేరుగా లబ్దిదారుడి బ్యాంక్ ఖాతాలో వేయనున్నారు. గతంలో పోస్టాఫీస్ ద్వారా అందించేవారు. అయితే ఇప్పుడు నేరుగా బ్యాంక్ అకౌంట్లో జమ చేయనున్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ
దాదాపు 2.50 లక్షల మందికి ఆగస్ట్ 15న పింఛన్లను పంపిణీ చేయనున్నారు. ఒంటరి మహిళలు, దివ్యాంగులు చేనేత, గీత కార్మికులు ఇందులో ఉన్నారు. ఇక ఇదే రోజు గిగ్ వర్కర్ల సంక్షేమ చట్టం అమల్లోకి తీసుకురానున్నారు. ఆన్ లైన్ ఫుడ్, క్యాబ్, గ్రోసరీ డెలివరీ కార్మికులకు అండగా ఈ చట్టం తీసుకోస్తున్నారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం పలు నిర్ణయాలు అమలు చేయనున్నారు. వారికి వేతన కొత, అన్యాయ అంక్షల నుంచి రక్షణ కల్పించనున్నారు. ఈ మేరకు గిగ్ వర్కర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయనున్నారు.

# మహిళా రిజర్వేషన్లకు షరతులెందుకు?

(మొదటి పేజీ తరువాయి)
అసంపూర్ణంగా, కుంటుపడిన స్థితిలోనే ఉంటుందని అన్నారు. ఈ విషయాన్ని ప్రజలకు అర్థమయ్యేలా చేయడమే తాను చేసే రాజకీయాల్లో కీలకమైన అంశమని అన్నారు.

రాహుల్ ఆలోచనా విధానంలో మార్పు
దీనిపై కిరణ్ రిజిజు స్పందిస్తూ కాంగ్రెస్?పై విమర్శలు చేశారు. మహిళల విషయంలో రాహుల్ గాంధీ ఆలోచనా విధానంలో మార్పు కనిపిస్తోందని తెలిపారు. అదే స్ఫూర్తితో మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ షరతులు లేని మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ వ్యాఖ్యలకే రాహుల్ గాంధీ తాజాగా సమాధానమిచ్చారు. కాంగ్రెస్ ఇప్పటికే బిల్లుకు మద్దతు తెలిపిందని, కొత్తగా మద్దతు ప్రకటించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. బదులుగా ఆమోదించిన చట్టాన్ని అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్
2023లో తీసుకొచ్చిన నారీ శక్తి వందన్ అధినియమ్ ద్వారా లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రతిపాదన ఉంది. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచడం ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. ఈ చట్టం పార్లమెంటులోని రెండు సభల్లోనూ ఆమోదం పొందింది. అయితే దాని అమలుకు సంబంధించిన తదుపరి ప్రక్రియ ముందుకు సాగలేదు. రాజ్యాంగ సవరణకు సంబంధించిన 131వ సవరణ బిల్లు లోక్‌సభలో అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీ సాధించలేక ఏప్రిల్ 17న విగిపోయింది.
మహిళా రిజర్వేషన్ల అమలును డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత చేపట్టాలన్న నిబంధనపై కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన రెండింటినీ ఒకదానితో ఒకటి అనుసంధానం చేయకూడదన్నది విపక్షాల ప్రధాన డిమాండ్. లోక్‌సభలో రాష్ట్రాల వారీగా స్థానాల సంఖ్యను పునఃపరిశీలించే డీలిమిటేషన్ ప్రక్రియపై కూడా విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా జనాభా నియంత్రణలో ముందున్న రాష్ట్రాలకు భవిష్యత్తులో ప్రాతినిధ్యం తగ్గే అవకాశం ఉందన్న వాదనలతో ఈ అంశంపై రాజకీయ చర్చ కొనసాగుతోంది.

# అమెరికా జాబ్ మార్కెట్ డీలా

(మొదటి పేజీ తరువాయి)
నిలుపుకోవాలని ట్రంప్‌నకు చెందిన రిపబ్లికన్ పార్టీ కోరుకుంటోంది. అంతలోనే శుక్రవారం కార్మిక శాఖ విడుదల చేసిన జులై ఉద్యోగాల గణాంకాలు అమెరికా జాబ్ మార్కెట్‌కు, ట్రంప్‌నకు గట్టి ఎదురుదెబ్బగా నిలిచాయి.

తగ్గిన నిరుద్యోగిత రేటు
జులైలో దాదాపు లక్ష ఉద్యోగాలు కొత్తగా భర్తీ అవుతాయని నిపుణులు అంచనా వేశారు. అయితే అందుకు భిన్నంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలు స్కూల్స్, రెస్టారెంట్లు, బార్లు, రిటైలర్ రంగాల్లో పనిచేసే ఉద్యోగులు ఉద్వాసనకు గురయ్యారు. అయితే జులై నిరుద్యోగ రేటు 4.1 శాతానికి చేరింది. 2025 జూన్ తర్వాత ఇదే అత్యల్పం. అయితే జులైలో 2,64,000 మంది అమెరికా కార్మిక మార్కెట్ నుంచి వైదొలగడం వల్ల నిరుద్యోగిత రేటు తగ్గింది. పని చేస్తున్న లేదా పని కోసం చూస్తున్న వారి వాటా 61.4 శాతానికి పడిపోయింది. 2021 ఫిబ్రవరి తర్వాత ఇదే అత్యల్పం. మరోవైపు, జులైలో ఉద్యోగుల వేతనాలు స్వల్పంగా పెరిగాయి. ఉద్యోగి సగటు గంట వేతనం 2025 జులైతో పోలిస్తే 3.2శాతం పెరిగింది. అమెరికన్ కుటుంబాలు అధిక జీవన వ్యయాల భారంతో సతమతమవుతున్న సమయంలో ఈ వేతనాల పెంపు జరిగింది.

వాస్తవ పరిస్థితులు వేరుగా
అమెరికా పరిశ్రమలను రక్షించడానికి, తయారీ రంగ ఉద్యోగాలను సృష్టించడానికి ట్రంప్ సర్కార్ ఇతర దేశాలపై భారీ సుంకాలను విధించింది. తమ ఆర్థిక వ్యవస్థలో స్వదేశీ పౌరులకు ఉద్యోగాలు పెరుగుతున్నాయని ట్రంప్ చాలా కాలంగా చెబుతున్నారు. స్వదేశీయులకు ఉద్యోగాలు దక్కేలా చేస్తామని హామీ ఇచ్చారు. అయితే వాస్తవ పరిస్థితులు వేరేలా ఉన్నాయి. గత ఏడాది కాలంలో 7,20,000 మంది అమెరికన్లు ఉద్యోగాలు కోల్పోయారు.

ఫెడ్ వడ్డీ రేట్లపై యూఎస్ జాబ్ మార్కెట్ ప్రభావం
అమెరికాలో ద్రవ్యోల్బణాన్ని తిరిగి 2 శాతానికి తీసుకురావడమే లక్ష్యంగా ఫెడరల్ రిజర్వ్ పనిచేస్తోంది. గత వారం జరిగిన సమావేశంలో ఫెడ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచింది. కానీ ముగ్గురు అధికారులు వడ్డీ రేట్లను పెంచాలని కోరారు. కానీ ఆ నిర్ణయం జరగలేదు. ఈ ఏడాది చివర్లో ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు ఉంటుందని వాల్ స్ట్రీట్ వ్యాపారులు ఆశిస్తున్నారు. కాగా, వడ్డీ రేట్ల పెంపు సమర్థనీయమా కాదా అని ఫెడ్ చర్చించేటప్పుడు వారు యూఎస్ ఉద్యోగ మార్కెట్ పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలని ఆర్థికవేత్త డేనియల్ ఝావో అభిప్రాయపడ్డారు.

ఈ ఏడాది ఉద్యోగ నియామకాలు అంతంత మాత్రమే
ఈ ఏడాది ఇప్పటి వరకు కంపెనీలు నెలకు 61,000 ఉద్యోగాలను మాత్రమే కల్పిస్తున్నాయి. 2002 తర్వాత ఆర్థిక మాంద్యం లేని కాలంలో ఇంతటి బలహీనమైన నియామకాలు జరగడం ఇదే మొదటిసారి. కాగా, 2023–2024 ఆర్థిక సంవత్సరంలో నెలకు 1,66,000 ఉద్యోగాల కల్పన జరిగింది. దానితో పోల్చితే ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగాల కల్పన చాలా తక్కువగా ఉంది. కొవిడ్ లాక్‌డౌన్‌లు ముగిసిన తర్వాత 2021–2022 ఆర్థిక సంవత్సరంలోనూ యూఎస్‌లో ఉద్యోగ నియామకాలు భారీగానే జరిగాయి. మరోవైపు, ట్రంప్ వలసల విషయంలో కఠిన చర్యలు తీసుకోవడం, బేబీ బూమర్లు పెద్ద సంఖ్యలో పదవీ విరమణ చేయడం వల్ల ఉద్యోగాల కోసం పోటీపడే వారి సంఖ్య తగ్గింది. అందువల్ల ఫెడరల్ రిజర్వ్ ప్రకారం 2023–2024లో నెలకు 1,55,000గా ఉన్న బ్రేక్–ఈవెన్ నియామకాల రేటు, ఇప్పుడు దాదాపు సున్నాకు పడిపోయింది.

# కేసీఆర్ నాయకత్వంలో మరో తెలంగాణ ఉద్యమం

(మొదటి పేజీ తరువాయి)
స్పందించారు. యాగాలు చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం తన బాధ్యతలను కూడా నిర్వర్తించాలని తెలిపారు. దైవానుగ్రహానికి మానవ ప్రయత్నం తోడైనప్పుడే ఫలితాలు లభిస్తాయని హితవు పలికారు.

'కాంగ్రెస్‌వి సిగ్గుమాలిన రాజకీయాలు'
హరీశ్‌రావు దేవాలయానికి వెళ్తే కాంగ్రెస్ నాయకులు చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని కేటీఆర్? విమర్శించారు. చేతబడి, క్షుద్ర పూజలు చేస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ నీచమైన, సిగ్గులేని రాజకీయాలకు పాల్పడుతోందన్నారు. వ్యవసాయం, రైతుల పట్ల ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డికి కనీస అవగాహన గానీ చిత్తశుద్ధి గానీ లేవని ఆక్షేపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే సీఎం ఆ జిల్లాకే సాగునీరు అందించడంలో విఫలమవుతున్నారని ఆయన? విమర్శించారు.

కేసీఆర్ నాయకత్వంలో భారీ పోరాటం
అధికారంలో ఉన్నా లేకపోయినా తాము ఎప్పుడూ రాష్ట్ర శ్రేయస్సునే కోరుకుంటామని కేటీఆర్? చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధమన్న ఆయన 24 గంటల విద్యుత్ సరఫరా ఎక్కడ ఉందో కాంగ్రెస్ నాయకులు తనకు చూపించాలని సవాలు విసిరారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఆంధ్రప్రదేశ్ నీటిని తరలిస్తున్నా ఈ ప్రభుత్వం ఉదాసీనంగా ఉంటోందని ఆరోపించారు. తెలంగాణ నీటి హక్కులను ఏపీ హరిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.కేసీఆర్ నాయకత్వంలో తాము బీభత్సమైన పోరాటం చేస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ స్థాయిలోనే మరో ఉద్యమాన్ని ప్రారంభిస్తామన్నారు. గోదావరి బోర్డు సమావేశంపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో పేదల కడుపు కొడుతోందంటూ ఆయన విమర్శించారు.

# ఎగ్జిబిషన్ దందా వెనుక ఎవరు..?





- రోడ్డును క్రాస్ చేస్తూ విద్యుత్ బల్బుల తోరణం
- కరెంట్ తీగలను ఆనుకుని ముఖద్వార హోర్డింగులు
- వాకింగ్ ట్రాక్‌నే ఫైర్ ఇంజన్ రోడ్‌గా మార్చేశారు

**టీ మీడియా, ఆగస్టు 8, ఖమ్మం బ్యూరో:**
ఆది నగరంలో నిత్యం రద్దీగా ఉండే పెవిలియన్ గ్రౌండ్––మయూరి సెంటర్ రోడ్‌లో ఆర్టీసీ బస్సులు అటువైపు నుంచి డిపోకు వెళ్తుంటాయి. అటువంటి మార్గంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్‌కు మున్సిపల్ అధికారులు అనుమతి ఇచ్చారు.
అయితే ఎలాంటి అనుమతులు లేవని ఇటీవల ఖమ్మం 2వ టౌన్ పోలీసులు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అన్ని అనుమతులు వచ్చాయని నిర్వాహకులు శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రకటించారు. అయితే ఈ సమావేశంలో ఎలాంటి అనుమతి పత్రాలను ప్రదర్శించలేదు. అనంతరం ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు.

సీఎం ఫొటోతో హోర్డింగులు
ఇది ఇలా ఉంటే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోతో కూడిన పసుపు రంగు హోర్డింగులను పెవిలియన్ గ్రౌండ్ ముఖద్వారం వద్ద నిర్వాహకులు ఏర్పాటు చేశారు. అవి కూడా అటువైపు నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలను ఆనుకుని ఉన్నాయి.
అంతే కాకుండా గ్రౌండ్ ముందు నుంచి వెళ్లే రద్దీ రోడ్డుపై ఏకంగా 100 వాట్ల బల్బులను ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలకు కట్టి తోరణాలుగా వేలాడదీశారు. చట్టవిరుద్ధంగా ఇంతటి ప్రమాదకర చర్యలకు పూనుకున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో.. అసలు ఎగ్జిబిషన్ నిర్వాహకులకు వెనుక అండ ఎవరు? అనే చర్చ సాగుతోంది. ముడుపుల వ్యవహారం భారీగా ఉందనే ప్రచారం కూడా జరుగుతోంది.

ప్రమాదకర పరిస్థితులు
ఎగ్జిబిషన్ నిర్వహణ ప్రమాదకరంగా ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. క్రీడా స్థలమైన గ్రౌండ్ దెబ్బతినే అవకాశం ఉంది. లక్షల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్‌కు ఇబ్బంది కలిగే పరిస్థితి ఉంది.
అత్యవసర పరిస్థితుల్లో ఫైర్ ఇంజన్ తిరగడానికి కూడా అవకాశం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు కనిపిస్తోంది. ప్రవేశ ద్వారం, అత్యవసర నిష్క్రమణ ద్వారాలు రద్దీకి అనుగుణంగా ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
మొత్తం గ్రౌండ్‌లో కొంత భాగాన్ని మాత్రమే కేటాయించినప్పటికీ, అంతకుమించిన స్థలాన్ని నిర్వాహకులు తమ ఆధీనంలోకి తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జెయింట్ వీల్ తదితర రైడ్ల ఆపరేటర్లకు సరైన శిక్షణ ఉందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వాటిని తనిఖీ చేసి సేఫ్టీ సర్టిఫికెట్లు జారీ చేశారా? అనే ప్రశ్నలు కూడా తలెత్తుతున్నాయి.

నిబంధనల ప్రకారం..
ఎగ్జిబిషన్ నిర్వహణకు సంబంధించి మున్సిపల్, విద్యుత్, అగ్నిమాపక, పోలీస్ తదితర శాఖల నుంచి అవసరమైన అనుమతులు, భద్రతా ప్రమాణాలు పాటించారా? అనే అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రజల భద్రతకు ముప్పు కలిగించేలా ఉన్న విద్యుత్ అలంకరణలు, హోర్డింగులు, రైడ్ల భద్రతా ప్రమాణాలపై సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అవసరమైన పత్రాలు
జెయింట్ వీల్ / పిల్లల వినోద రైడ్స్ వివరాలు. రైడ్ పరికరాల ఫిట్‌నెస్, భద్రతా ధృవపత్రాలు రైడ్ నిర్వహించే ఆపరేటర్ల వివరాలు. విద్యుత్ భద్రతా ధృవపత్రం, బీమా పాలసీ / ఇతర వర్తించే పత్రాలు, సంబంధిత అధికారుల తనిఖీ, అనుమతి / ధృవీకరణ, రైడ్ నిర్వహణకు బాధ్యత వహించే వ్యక్తి వివరాలు, అత్యవసర పరిస్థితుల్లో రైడ్ నిలిపివేసే భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు, ముఖ్యంగా పిల్లలకు భద్రతా చర్యలు.
భద్రతా అనుమతులు తప్పనిసరి
పె విలియన్ గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ నిర్వహిస్తూ జెయింట్ వీల్, పిల్లల వినోద రైడ్స్ వంటి అమ్యూజ్‌మెంట్ రైడ్స్ ఏర్పాటు చేయాలంటే నిర్వాహకులు ముందస్తుగా అవసరమైన భద్రతా చర్యలు, అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఎగ్జిబిషన్లు, వినోద కార్యక్రమాలు తెలంగాణ ఫైర్ సర్వీస్ నిబంధనల్లో ఫైర్–హజార్డ్ కేటగిరీలో ఉన్నాయి.రైడ్స్ ఏర్పాటు చేసే నిర్వాహకులు రైడ్ పరికరాల ఫిట్‌నెస్, భద్రతా ధ్రువపత్రాలు, రైడ్స్ నిర్వహించే ఆపరేటర్ల వివరాలు, విద్యుత్ భద్రతా ధ్రువపత్రాలు, వర్తించే బీమా పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది. అలాగే సంబంధిత అధికారుల తనిఖీ, అనుమతి లేదా ధృవీకరణ పొందిన తర్వాతే రైడ్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం సురక్షితం.రైడ్స్ వద్ద పిల్లలు, సందర్శకుల భద్రతకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో రైడ్‌ను వెంటనే నిలిపివేసే వ్యవస్థ, రక్షణ సిబ్బంది, ఫస్ట్ ఎయిడ్ సదుపాయం, తగినంత భద్రతా సిబ్బంది ఉండేలా చూడాలి.ఎగ్జిబిషన్ నిర్వహణకు పోలీస్, ఫైర్ తదితర సంబంధిత శాఖల అనుమతులు కూడా కార్యక్రమ స్వభావాన్ని బట్టి తీసుకోవాల్సి ఉంటుంది. తెలంగాణలో ఎగ్జిబిషన్లు వాణిజ్య కార్యక్రమాలుగా పరిగణించే పోలీస్ అనుమతి విధానాలు అమల్లో ఉన్నాయి.అనుమతులు, భద్రతా ధ్రువపత్రాలు లేకుండా రైడ్స్ నిర్వహించడం ద్వారా ప్రమాదాలు జరిగితే నిర్వాహకులపై బాధ్యత వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు ముందస్తు తనిఖీలు నిర్వహించి అనుమతులు జారీ చేయాల్సిన అవసరం ఉంది.ప్రధానంగా అవసరమయ్యే అనుమతులుఎగ్జిబిషన్ వాణిజ్య/టికెట్ కార్యక్రమంగా ఉంటే సంబంధిత పోలీస్ కమిషనరేట్/పోలీస్ అధికారుల అనుమతి అవసరం.

ఫైర్ సర్వీసెస్ నో అబ్జెక్షన్
టెంట్లు, స్టాల్స్, జన సమూహం, తాత్కాలిక నిర్మాణాలు ఉన్నందున ఫైర్ సేఫ్టీ ప్లాన్ తప్పనిసరిగా పరిశీలించాలి.
ఫైర్ టెండర్ ప్రవేశానికి అవసరమైన మార్గం, ఎమర్జెన్సీ ఎగ్జిట్లు, అగ్నిమాపక పరికరాలు తదితర అంశాలను అధికారులు పరిశీలిస్తారు.

మున్సిపల్‌అనుమతి
గ్రౌండ్ ఏ మున్సిపాలిటీ/కార్పొరేషన్ పరిధిలో ఉందో దాని ఆధారంగా తాత్కాలిక నిర్మాణాలు, స్టాల్స్, టెంట్లు, సైట్ వినియోగానికి సంబంధిత అనుమతులు.ప్రభుత్వ స్థలం అయితే సంబంధిత మున్సిపల్ శాఖ అనుమతి.

విద్యుత్ అనుమతి
తాత్కాలిక విద్యుత్ కనెక్షన్, వైరింగ్, జనరేటర్లు, ఎర్తింగ్, ఐదీలు, కేబుల్స్‌కు భద్రతా నిబంధనలు పాటించాలి.
పెద్ద కార్యక్రమాల్లో విద్యుత్ భద్రత/తనిఖీ అవసరం.ఫుడ్ స్టాల్స్ ఉంటే;ఆహారం విక్రయించే ప్రతి స్టాల్‌కు వర్తించే స్థానిక ఆహార భద్రతా నిబంధనలు పాటించాలి.ఎల్పీజీ ఉపయోగిస్తే ఫైర్ సేఫ్టీ, సిలిండర్ల నిల్వ/వినియోగ నిబంధనలు ప్రత్యేకంగా వర్తిస్తాయి.
లౌడ్‌స్పీకర్ / సౌండ్పోలీస్/సంబంధిత అధికారుల అనుమతి అవసరం .శబ్ద కాలుష్య నిబంధనల్లో నిర్ణయించిన సమయాలు, శబ్ద పరిమితులను పాటించాలి.
అమ్యూజ్‌మెంట్భద్రత/సాంకేతిక తనిఖీలు సంబంధిత అనుమతులు అవసరం కావచ్చు.
ప్రత్యేకంగా పిల్లలు ఉపయోగించే విషయంలో భద్రతా ధృవపత్రాలు తీసుకోవడం చాలా ముఖ్యం. ఓపెన్ గ్రౌండ్‌లో తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సిన భద్రతా అంశాలు:కనీసం అవసరమైన అత్యవసర నిష్క్రమణ ద్వారాలు, అగ్నిమాపక యంత్రాలుఅగ్నిమాపక వాహనం కు క్లియర్ యాక్సెస్, అత్యవసర లైటింగ్రథమ చికిత్స/వైద్య సదుపాయం .తాగునీరు,తగినన్ని మరుగుదొడ్లు ,మహిళలు/పిల్లల భద్రత,జన నియంత్రణ అడ్డంకులు,పార్కింగ్ ట్రాఫిక్ నిర్వహణసీసీటీవీసెక్యూరిటీ,తాత్కాలిక స్టాల్స్‌కునిర్మాణ స్థిరత్వం ,విద్యుత్ వైర్లను సురక్షితంగా ఏర్పాటు చేయడం.



# మీతో మీకే నిజమైన పోటీ

(మొదటి పేజీ తరువాయి)
మరోలా కనిపిస్తుందన్నారు. టెక్నాలజీ, పరిశ్రమలు, ప్రొఫెషన్స్ ఎప్పుడూ మారుతుంటాయని, కానీ ఎప్పుడూ నేర్చుకోవడమే కీలకమైన అంశంగా మిగులుతుందన్నారు. ఎవరైతే కొత్త విషయాలను నేర్చుకుంటారో, వారే విజేతలుగా నిలుస్తారని ప్రధాని అన్నారు. కొత్తగా ఎదురవుతున్న సవాళ్లను పరిష్కరించే ధైర్యాన్ని విద్యార్థులు ప్రదర్శించాలన్నారు. అవరోధాలను అవకాశాలుగా మార్చుకోవాలన్నారు.
అకాడమిక్ జీవితంతో పాటు క్యాంపస్ బయటి ప్రపంచం గురించి వివరిస్తూ. ఐఐటీ పరీక్షల్లో కచ్చితమైన సిలబస్ ఉంటుందని, కానీ జీవితమనే పరీక్షలో మాత్రం, అన్నీ సిలబస్‌లో లేని అంశాలే ఉంటాయన్నారు. కానీ ఉత్సుకతతో ఉండాలని ఆయన విద్యార్థులను ఎంకరేజ్ చేశారు. వ్యవస్థీకృత సిద్ధాంతాలను ప్రశ్నిస్తూనే.. వాటికి తగిన పరిష్కారాన్ని కనుగొనే ధైర్యాన్ని కలిగి ఉండాలన్నారు. స్పేస్ టెక్నాలజీ, సెమీకండక్టర్స్, డ్రోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, క్రిటికల్ మినరల్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఎనర్జీ స్టోరేజ్ లాంటి రంగాలు విస్తృతంగా వ్యాపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.
దేశంలోని యువత ఆవిష్కరణల వల్ల స్టార్టప్ వ్యవస్థ, డిజిటల్ ఎకానమీ బలోపేతం అయ్యిందన్నారు. పరిశోధనా రంగం మరో కీలకమైన అంశమన్నారు. ప్రైమ్‌మినిస్టర్స్ రీసర్చ్ ఫెల్లోషిప్, ద రీసెర్చ్, డెవలప్మెంట్ అండ్ ఇన్నోవేషన్ స్కీమ్, అనుసంధాన్ నేషనల్ రీసర్చ్ ఫౌండేషన్ వ్యవస్థలను వాడుకోవాలన్నారు. పరిశోధనా, అధ్యయన వ్యవస్థలను బలోపేతం చేసేందుకు యువ పరిశోధకులు మరింత పట్టుదలతో ఉండాలన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే, విద్యార్థుల కెరీర్ దానిలో భాగస్వామ్యం కావాలన్నారు. కీలక నిర్ణయాలు తీసుకుంటున్న సమయంలో.. జాతీయ ప్రయోజనాల గురించి ఆలోచించాలన్నారు.
జీతాలు, ఉద్యోగాలు, కంపెనీలు, ఘనతల గురించి విద్యార్థులు మిగితా వారితో పోల్చుకోవద్దు అని, ముఖ్యంగా సోషల్ మీడియాలో ఇలాంటివి చేయకూడదని ప్రధాని మోదీ విద్యార్థులను హెచ్చరించారు. జీవితం అంటే లీడర్‌బోర్డు కాదు అని, మీ పోటీ ఇతర వ్యక్తులతో కాదు అని, మీతో మీరే పోటీపడాలని అన్నారు. స్వంత ప్రగతిపై ఫోకస్ పెట్టాలని, నిరంతరం నేర్చుకోవాలని, జీవితంలో కొత్తది నేర్చుకునేందుకు ఎప్పుడూ ఉత్సుకతతో ఉండాలన్నారు.

# ఇన్‌స్టాగ్రామ్ రీల్‌తో గలీజ్ దందా..



### ⏭ నాగర్ కర్నూల్‌లో తీగ లాగితే ఏపీలో కదిలిన డొంక..

**టి మీడియా ,ఆగస్టు 8 , నాగర్ కర్నూల్ ;**
నాగర్ కర్నూల్ జిల్లాలో నకిలీ నోట్ల ముఠా తీగ లాగితే ఏపీలో పూర్తి డొంక కదిలింది. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు మంగనూరు గ్రామానికి చెందిన కురుమూర్తి, నవీన్ గౌడ్ ఈజీ మనీ కోసం అన్వేషణ మొదలుపెట్టారు. అందులో భాగంగా ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ కరెన్సీ సరఫరా కోసం వెతికారు. ఈ క్రమంలో వచ్చిన ఓ రీల్‌ను చూసి కురుమూర్తి, నవీన్ గౌడ్ సంప్రదింపులు ప్రారంభించారు. ఆ తర్వాత ఏపీలోని భీమవరానికి చెందిన సదరు వ్యక్తులతో పరిచయం పెంచుకుని.. కొంత మొత్తాన్ని తెచ్చుకున్నారు. అసలు డబ్బుకు బదులుగా నాలుగు రెట్లు నకిలీ కరెన్సీ తీసుకునే ఒప్పందం చేసుకున్నారు. రూ.80వేల విలువైన నకిలీ రూ.500 నోట్లు తెప్పించారు. అందులో కొంత భాగాన్ని కురుమూర్తికి ఇచ్చారు. వాటిని గుర్తించలేరన్న ధీమాతో మంగనూరు గ్రామంలోని దాబా, కిరాణ షాపులు, పెట్రోల్ బంక్, వైన్ షాపులో చలామణి చేశాడు. అయితే వైన్ షాపులో క్యాషియర్ కౌంటింగ్ మెషీన్‌లో పరీక్షించగా నోట్లు నకిలీవని తేలింది. దీంతో వెంటనే బిజినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇక పోలీసుల దర్యాప్తులో కీలక ఆధారాలు సేకరించడంతో మంగనూరులోని ఓ ఇంటిపై దాడి చేశారు. అక్కడ ఏడు మంది కలిసి ప్రత్యేక పేపర్, కల్ ఫోటోకాపీ మెషిన్, కౌంటింగ్ మెషిన్‌తో నకిలీ రూ.500నోట్లు ముద్రిస్తున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.68వేల విలువైన నకిలీ నోట్లు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మొత్తం 8మంది ప్రమేయం ఉన్నట్లు గుర్తించగా.. వారిలో ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా.. మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. నకిలీ కరెన్సీ తయారీ, రవాణా, చలామణి చేసేందుకు కుట్ర పన్నినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. అనుమానాస్పద కరెన్సీ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సోషల్ మీడియాలో ఈజీ మనీ పేరుతో వచ్చే అక్రమ ఆఫర్లను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. కాగా ఇన్‌స్టాగ్రామ్‌లో మొదలైన పరిచయం.. నకిలీ నోట్ల దందాకు దారి తీసి చివరకు కటకటాల పాలయ్యారు.

# హనీ ట్రాప్‌లో పడి దేశ రక్షణ సమాచారం లీక్




### ⏭ ఐఏపీ వింగ్ కమాండర్ అరెస్టు

**టి మీడియా ,ఆగస్టు 8 , ఢిల్లీ బ్యూరో :**
హనీ ట్రాప్?లో చిక్కుకొని దేశ రక్షణ సమాచారాన్ని లీక్ చేశారనే ఆరోపణలపై ఒక ఇండియన్ ఎయిర్?ఫోర్స్? (ఐఏఎఫ్) వింగ్? కమాండర్?ను అరెస్టు చేసినట్లు వైమానిక దళ అధికారులు శనివారం తెలిపారు. సోషల్ మీడియా ద్వారా పాకిస్థాన్ ఇంటెలిజెన్స్? ఏజెంట్లు ఆయనను 'వలపు వల'(హనీ ట్రాప్?)లోకి లాక్కున్నారని పేర్కొన్నారు. సదరు అధికారిని తమ నిఘాలో ఉంచి, తర్వాత సంబంధిత విచారణ సంస్థలకు అప్పగించామని చెప్పారు. తాము తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యల వల్లే సదరు అధికారి పట్టుబడ్డారని తెలిపారు. అధికారిక రహస్యాల చట్టం (అఫీషియల్ సీక్రెట్స్ యాక్ట్) ప్రకారం, ఇలాంటి నేరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు.

దిల్లీ పోలీసుల ప్రకారం, రక్షణ రంగానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని లీక్ చేసినందుకు ఐఏఎఫ్? వింగ్? కమాండర్?ను అరెస్టు చేశారు. ప్రస్తుతం అతను జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. దేశ రక్షణకు సంబంధించిన రహస్య పత్రాలను, సమాచారాన్ని శత్రుదేశాలకు అందించారనే ఆరోపణలపై, సదరు అధికారిపై అఫీషియల్? సీక్రెట్స్? యాక్ట్? నిబంధనల ప్రకారం కేసు నమోదు చేశారు.

**ఎలా పట్టుబడ్డాడు?**

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఐఏఎఫ్ అధికారి పాకిస్థాన్? ఇంటెలిజెన్స్? ఏజెంట్లు పన్నిన హనీ ట్రాప్?లో పడ్డాడు. తన తోటి ఉద్యోగి మొబైల్? ఫోన్?ను కంట్రోల్ చేసేందుకు, డేటాను తస్కరించే ఓ సాఫ్ట్?వేర్?ను అందులో ఇన్?స్టాల్ చేయడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసుకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ఐఏఎఫ్? ఇంటెలిజెన్స్? వింగ్?, దిల్లీ పోలీసులకు ఇచ్చిన తర్వాతే సదరు అధికారిని అరెస్టు చేయడం జరిగింది. ఈ కేసుపై ప్రస్తుతం అన్నికోణాల్లో దర్యాప్తు జరుగుతోంది.

**ఇంతకు ముందు కూడా ఇలాగే!**

గతేడాది కూడా పాకిస్థాన్? గూఢచార సంస్థ ఐఎస్ఐ కోసం గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై అల్వార్ ప్రాంతానికి చెందిన మంగత్ సింగ్?ను పోలీసులు అరెస్టు చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత, అతను అల్వార్?లోని కంటోన్మెంట్?పై, సైనికుల కదలికలపై నిఘా పెట్టాడని రాజస్థాన్ పోలీసులు తెలిపారు. అతను పాకిస్థానీ హ్యాండ్లర్? అయిన 'ఇషా శర్మ' (నకిలీ పేరు) పన్నిన వలపువలలో చిక్కుకున్నాడని తెలిపారు. ఆ మహిళా పాక్ హ్యాండ్లర్? నిందితుడికి డబ్బు ఆశచూపి, నిఘా సమాచారాన్ని సేకరించే ప్రయత్నం చేసిందని చెప్పారు. మంగత్ సింగ్ అప్పటికి రెండేళ్లుగా సోషల్ మీడియా వేదికల ద్వారా పాక్ హ్యాండ్లర్లతో సంబంధాలు కలిగి ఉన్నట్లు గుర్తించామని పేర్కొన్నారు.

**ఫొటోలు పెట్టొద్దు– రీల్స్ చేయొద్దు**

గతంలోనూ ఇలాంటి ఘటనలే వెలుగుచూశాయి. దీనితో 2023 ఆగస్టులో సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్న కేంద్ర పోలీసు బలగాలకు కీలక ఆదేశాలు జారీ అయ్యాయి. ఆన్‌లైన్ ఫ్రెండ్?షిప్? జోలికి వెళ్లవద్దని, సోషల్ మీడియాలో వీడియోలు, రీల్స్ చేయొద్దని తమ సిబ్బందిని కేంద్ర పోలీసు బలగాలు హెచ్చరించాయి. వీటి వల్ల హనీట్రాప్?కు గురయ్యే ప్రమదం ఉందని తెలిపాయి. ముఖ్యంగా దేశరక్షణకు సంబంధించిన సున్నితమైన సమాచారం శత్రువులకు చేరుతుందని హెచ్చరించాయి.

కొంత మంది సిబ్బంది యూనిఫామ్‌లోనే తమ వీడియోలను సోషల్‌మీడియాలో షేర్ చేస్తున్నట్లు, కేంద్ర నిఘా సంస్థలు చేపట్టిన పరిశీలనలో వెల్లడైంది. దాంతోపాటు సున్నితమైన ప్రదేశాల్లో దిగిన ఫొటోలను షేర్ చేయడం, ఆన్‌లైన్‌లో స్నేహితుల కోసం రిక్వెస్ట్‌లు పంపడం వంటి చర్యలను నిఘా సంస్థలు గుర్తించాయి. దీనితో కేంద్ర పారామిలిటరీ, పోలీసు బలగాలకు కేంద్ర నిఘా సంస్థలు లేఖ రాశాయి. దీంతో అప్రమత్తమైన పోలీసు బలగాలు తమ సిబ్బందికి కీలక ఆదేశాలు జారీ చేశాయి. యూనిఫామ్‌లో ఉన్న వీడియోలు, ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయవద్దని సూచించాయి. ఆన్‌లైన్‌లో గుర్తుతెలియని వ్యక్తులతో స్నేహం చేయొద్దని స్పష్టం చేశాయి. ఈ మార్గదర్శకాలను ఉల్లంఘిస్తే తీవ్రమైన క్రమశిక్షణా చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించాయి. సీఆర్‌పీఎఫ్, బీఎస్‌ఎఫ్, ఐటీపీబీ, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ?బార్డర్? సెక్యూరిటీ ఫోర్స్?, ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్ సిబ్బందికి ఈ ఆదేశాలు అందాయి. అయినప్పటికీ పాక్ హ్యాండ్లర్ల హనీట్రాప్?లో కొందరు అధికారులు పడుతుండడం గమనార్హం.

# ఘోర బస్సు ప్రమాదం

### ⏭ ఏడుగురు మృతి, 11 మందికి తీవ్ర గాయాలు..!



**టి మీడియా ,ఆగస్టు 8 , ఢిల్లీ బ్యూరో ;** హిమాచల్ ప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చంబా జిల్లాలోని తిస్సా--బైరాగఢ్ రహదారిపై శనివారం (ఆగస్టు 08) ఉదయం జరిగిన బస్సు ప్రమాదంలో ఏడుగురు ప్రయాణికులు మృతి చెందగా.. మరో 11 మంది గాయపడ్డారు. చలుజ్ మోర్ సమీపంలో ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం తీవ్రతతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

ప్రాథమిక సమాచారం ప్రకారం.. బైరాగఢ్ నుంచి చంబా జిల్లా వైపు ప్రయాణికులతో వెళు‌న్న బస్సు చలుజ్ మోర్ సమీపంలో అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఘటన సమయంలో బస్సులో సుమారు 15 నుంచి 20 మంది వరకు ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదానికి కచ్చితమైన కారణం తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురిలో నలుగురు పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నట్లు సమాచారం. బస్సు డ్రైవర్, కండక్టర్ కూడా మృతుల్లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. బస్సు రహదారి నుంచి అదుపుతప్పిన సమయంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తున్నప్పటికీ.. ప్రమాదానికి అతివేగమా, డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమా, రహదారి పరిస్థితులా అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదం జరిగిన వెంటనే భారీ శబ్దం విని స్థానికులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్సులో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు స్థానికులు పోలీసులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం పోలీసు సిబ్బంది కూడా అక్కడికి చేరుకుని సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ప్రమాదంలో గాయపడిన 11 మంది ప్రయాణికులను తిస్సా సివిల్ ఆసుపత్రికి తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

బస్సు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బస్సు ప్రమాదానికి గురైన తీరును పరిశీలించడంతో పాటు డ్రైవర్‌కు సంబంధించిన వివరాలు, వాహనం పరిస్థితి, రహదారి పరిస్థితులు, ప్రయాణికుల వాంగ్మూలాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ ఘటనను తిస్సా పోలీస్ స్టేషన్ అదనపు ఎస్‌హెచ్‌ఓ అనుభవ్ శర్మ ధృవీకరించారు. ప్రమాదానికి అసలు కారణం దర్యాప్తు పూర్తయిన తర్వాతే వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కొండ ప్రాంతాల్లో ప్రమాదకర మలుపులు, ఇరుకైన రహదారుల కారణంగా తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో.. ఈ ఘటన మరోసారి ప్రయాణికుల భద్రతపై ఆందోళన కలిగిస్తోంది.

# అడవిలో అభివృద్ధి బాటలు

### ⏭ సవాళ్లను అధిగమిస్తూ గిరి శిఖర గ్రామాలకు రోడ్లు



**టి మీడియా ,ఆగస్టు 8 , అమరావతి బ్యూరో :**
గిరిజన ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించడానికి, ముఖ్యంగా డోలీ మోతల సంస్కృతిని అంతం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక పథకమే 'అడవి తల్లి బాట'. ఈ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభించారు. మొదటి దశలో రూ.1,005 కోట్ల వ్యయంతో 1,069 కి.మీ. రోడ్లను చేపట్టగా, ప్రస్తుతం 'అడవి తల్లి బాట 2.0' ద్వారా దీనిని రూ.2,078 కోట్లకు (2,310 కి.మీ.) విస్తరించారు. అడవి తల్లి బాట కార్యక్రమం మొదటి రోజు నుంచి పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, పనులు వేగంగా ముందుకు తీసుకువెళ్లే విధంగా పవన్ కల్యాణ్ సూచనలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది.

గిరిజన గ్రామాల అడవి తల్లి బాటల రహదారి పనుల్లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరంతర పర్యవేక్షణ వల్ల స్పష్టమైన పురోగతి కనిపిస్తుంది. విస్తరణ పనుల్లో ఇప్పటికే 905 కి.మీ. నిర్మాణం పూర్తి కాగా, పెండింగ్ పనులపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో పవన్ సమీక్షించారు. మిగిలిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అటవీ అనుమతులు జాప్యం లేకుండా సమన్వయం చేసుకోవాలని, వర్షాల వల్ల ఆటంకాలు ఉన్న రోడ్లు మినహా మిగిలిన పనులు కొనసాగించాలన్నారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

సవాళ్ల నడుమ రోడ్డు నిర్మాణం అడవి తల్లి బాట కార్యక్రమంలో భాగంగా చాలా గ్రామాలకు రోడ్డు వేయడం కంటే ముందు దారి నిర్మించేందుకు సంక్లిష్ట పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చిందని కార్యాలయం తెలిపింది. రోడ్ల నిర్మాణం కోసం అడ్డుగా ఉన్న పెద్ద పెద్ద గుట్టలను బ్రేక్ చేసి, రాళ్లు పగలగొట్టి దారి ఏర్పాటు చేశారు. ఆ దారిపై రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. దారులు వేసిన తర్వాత కొన్ని ప్రాంతాలకు వాతావరణ పరిస్థితులు అనుకూలించక నిర్మాణ సామాగ్రి చేరుకోవడం కష్టతరంగా మారింది. అలాంటి సవాళ్ల మధ్య గిరిశిఖర గ్రామాలకు సైతం డోలీ కష్టాల నుంచి విముక్తి కల్పించాలన్న దృఢ సంకల్పంతో ఉప ముఖ్యమంత్రి ఈ ప్రణాళికలను ముందుకు తీసుకువెళ్లేందుకు నిర్ణయం తీసుకున్నారు.

**ప్రతి గిరిజన గ్రామం డోలీ రహితం కావాలన్న పవన్**

పవన్ కల్యాణ్ అడవి తల్లి బాట పనుల పురోగతిపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించి నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అటవీ అనుమతుల ప్రక్రియలో జాప్యం లేకుండా ఆయా జిల్లాల కలెక్టర్లు శాఖల మధ్య సమన్వయ బాధ్యత తీసుకుని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రికార్డు స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలకు అటవీ అనుమతులను పూర్తి చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

వర్షాల కారణంగా పనులకు ఆటంకాలు ఏర్పడిన ప్రాంతాలు మినహా, మిగిలిన అన్ని ప్రాంతాల్లో పనులు నిరంతరాయంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. గిరిజన గ్రామాలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను చేరువ చేయాలన్న బలమైన సంకల్పంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో చేపట్టిన అడవి తల్లి బాట పనుల్లో నాణ్యతా లోపాలకు తావు లేకుండా నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని తెలిపారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉపముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

# మన్యం జిల్లాలో గిరిజన సంఘాల బంద్

### ⏭ జీవో నెంబర్ 3 పునరుద్ధరించాలని డిమాండ్




**టి మీడియా ,ఆగస్టు 8 , అల్లూరి సీతారామరాజు :**
ఆదివాసీల చట్టాల పరిరక్షణ, జీవో నెంబర్ 3 పునరుద్ధరణే ధ్యేయంగా గిరిజన జేఏసీ, ఆదివాసీ సంఘాలు పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త మన్యం బంద్ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్రిక్తంగా కొనసాగుతోంది. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రమైన పాడేరులో ఉదయం నుంచే నిరసనల పర్వం మొదలైంది. పలు ఆదివాసీ సంఘాల నేతలు, కార్యకర్తలు భారీ సంఖ్యలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌కు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు.

**బంద్ ఉద్రిక్తత – వాహనాల నిలిపివేత**

నిరసనకారులు రోడ్డుకు అడ్డంగా కూర్చోవడంతో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. గిరిజన ఉద్యోగాల్లో 100 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో 3కి ప్రత్యామ్నాయంగా వెంటనే కొత్త జీవో జారీ చేయాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ నెరవేర్చాలని, 1/70 చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని నినాదాలు చేశారు.

ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీస్ బలగాలు మోహరించాయి. నిరసనకారులను రోడ్డుపై నుంచి అడ్డు తప్పించేందుకు పోలీసులు ప్రయత్నించడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. అనంతరం పోలీసులు ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ముందుకెళ్లేలా చేశారు. అయితే, బంద్ కారణంగా ప్రయాణికులు ఎవరూ లేకుండానే బస్సులన్నీ ఖాళీగా వెళ్లాయి.

**వర్షంలోనూ కొనసాగిన ఆందోళనలు**

జిల్లాలోని జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, అరకులోయ, డుంబ్రిగూడ, హుకుంపేట మండలాల్లో బంద్ కొనసాగుతోంది. ముంచంగిపుట్టు మండల కేంద్రంలో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నిర్వాహకులు రోడ్డుపైనే బైఠాయించి బంద్ నిర్వహించారు. ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి. అప్పలనరస, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మన్నపడాల్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సుందర్ రావు, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాల వీరుడు వీరయ్యకు కన్నీటి వీడ్కోలు



- భౌతికకాయంపై పార్టీ జెండా కప్పి సీపీఎం నాయకుల జోహార్లు
- పార్టీకి,ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

**టీ మీడియా,ఆగస్ట్08,సింగరేణి(కారేపల్లి):** సింగరేణి మండలం గాంధీనగర్ గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు ఏరిపోతు వీరయ్య (80) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు.జీవితాంతం పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ ప్రజా సమస్యలపై జరిగిన పోరాటాల్లో తనవంతు పాత్ర పోషించిన వీరయ్య మృతి పట్ల సీపీఎం నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.వీరయ్య మృతి విషయం తెలుసుకున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన భౌతికకాయాన్ని సందర్శించారు.భౌతికకాయంపై సీపీఎం పార్టీ జెండాను కప్పి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు.ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా సీపీఎం మండల నాయకులు కేసగాని రామ్మూర్తి,ఏరిపోతు భద్రయ్య మాట్లాడుతూ..వీరయ్య పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి సుదీర్ఘకాలం పనిచేశారని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ చేపట్టిన కార్యక్రమాలు,ఉద్యమాలు,పోరాటాల్లో వయస్సును సైతం లెక్కచేయకుండా చురుకుగా పాల్గొనేవారని గుర్తుచేశారు.పార్టీ అభివృద్ధికి,ప్రజా ఉద్యమాలకు వీరయ్య అందించిన సేవలు చిరస్మరణీయమని,ఆయన మృతి కుటుంబానికే కాకుండా సీపీఎం పార్టీకి కూడా తీరని లోటని పేర్కొన్నారు.ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని నాయకులు తెలిపారు.వీరయ్య భార్య [illegible] శ్రీనివాస్,సురేష్,రాధాకృష్ణ,కుమార్తె సావిత్రితో పాటు కుటుంబ సభ్యులకు నాయకులు ప్రగాఢ సంతాపం,సానుభూతి తెలియజేశారు.నివాళులర్పించిన వారిలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు కేసగాని ఉపేందర్,శాఖ కార్యదర్శి ఈసం వెంకటేశ్వర్లు,ఈసాల పగడయ్య,అబ్రహం,బీఆర్ఎస్ నాయకుడు బత్తుల శ్రీనివాసరావు, బంధుమిత్రులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

## గుంతల మయం, స్పందించిన వార్డ్ కౌన్సిలర్



**టీ మీడియా, ఆగస్టు 8 ,పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా 4వ వార్డ్ లోని వినాయక నగర్ లోని జెడ్ మార్ట్ రోడ్డు శృతి వాటర్ ప్లాంట్ రోడ్ సనా వాటర్ ప్లాంట్ రోడ్ లలో వర్షం నీటి తో రోడ్లు మొత్తం గుంతలతో జలమయం అయ్యి కాలనీవాసులు పలు ఇబ్బందులకు గురయ్యారు ఇట్టి విషయాన్ని వార్డ్ కౌన్సిలర్ దాసరి జమ్మలమ్మ దృష్టికి తీసుకువెళ్ళగా వెంటనే స్పందించి మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ కమిషనర్ గణేష్ దృష్టికి తీసుకువచ్చారు వారి సూచనలతో నీరు ఆగినటువంటి నీటి గుంత లతో వున్న ప్రతి రోడ్డు కు మట్టిని కొట్టించి జెసిబి తో చదును చేయించడం జరిగింది సమస్యపై వెంటనే స్పందించినందుకు కౌన్సిలర్ పై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

## డీజిల్ లేక అంబులెన్స్ బంద్



- ఆస్పత్రిలోనే చిన్నారి మృతి

**టీ మీడియా, ఆగస్టు 8, చింతూరు:** పోలవరం జిల్లా చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సదుపాయం లేక, మెరుగైన వైద్యశాలకు వెళ్లేందుకు అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో బాలిక మృతి చెందింది. చింతూరు మండలం పెదసీతనపల్లి గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి సోడి లశ్య.. సెలెబ్రల్ మలేరియాతో చనిపోయింది. మెరుగైన వైద్యం లభిస్తుందని భావించి చింతూరు ఏరియా ఆసుపత్రికి వచ్చిన గిరిజన బాలికకు నిరాశే ఎదురైంది. 100 పడకల అసూపత్రిగా అప్ గ్రేడ్ అయినా సరైన వసతులు, వైద్య సదుపాయం అందుబాటులో లేక ఇప్పటికీ మెరుగైన వైద్యం లభించడం లేదు. ఇంకా మెరుగైన వైద్యం కోసం భద్రాచలం, కాకినాడ వెళ్లాల్సిన పరిస్తితి నెలకొంది. ఈ క్రమంలోనే జ్వరంతో ఆసుపత్రికి వచ్చిన బాలికకు బ్రెయిన్ మలేరియా అని తేల్చారు వైద్యులు. మెరుగైన వైద్యం కోసం భద్రాచలం లేదా కాకినాడ వెళ్లాల్సి ఉంది. అయితే అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో మెగురైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు తరలించలేకపోయారు. దీంతో పాప ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి వచ్చింది.ప్రభుత్వ అంబులెన్స్ లు అందుబాటులో లేకపోవడంతో చింతూరు ఐటిడిఎ ఎదుట ఆందోళన చేపట్టారు బాలిక తల్లిదండ్రులు, కుటుంబీకులు. మృతి చెందిన బాలిక విషయంపై సమగ్ర విచారణ జరపాలని, చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని, అంబులెన్స్ లు 24 గంటలు అందుబాటులో ఉంచాలని ఆందోళన చేపట్టారు. చింతూరు ఐటిడిఎ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబులెన్స్ కి డీజిల్ ఇవ్వట్లేదని, డీజిల్ పేషంట్స్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పడంతో మెరుగైన వైద్యశాలకు వెళ్లలేని పరిస్తితి ఏర్పడింది. చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సదుపాయాలతో పాటు చనిపోయిన బాలిక కుటుంబానికి న్యాయం చేస్తామని చింతూరు ఐటిడిఎ పీవో హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ ఘటనపై చింతూరు ఐటిడిఎ పీఓ విచారణ చేపట్టారు.

# ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో వసూళ్ల దందా!

- ఇదేంటని అడిగితే అడ్మిషన్ కావాలా? వద్దా? అంటూ ప్రశ్నలు



**టి మీడియా ,ఆగస్టు 8 , హైదరాబాద్ బ్యూరో :** ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరంలో చేరుతున్న విద్యార్థుల నుంచి నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ పేరుతో కొన్ని ప్రైవేటు కాలేజీలు రూ.22 వేలు చొప్పున వసూలు చేస్తున్నాయి. మంచి బ్రాంచిల్లో సీటొచ్చింది కదా! సర్లే ఇచ్చేద్దాం అనుకుని విద్యార్థుల తల్లిదండ్రులు అదనంగా చెల్లిస్తున్నారు. మేడ్చల్‌కు సమీపంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల రూ.60 లక్షల అదనంగా వసూలు చేసుకుంది. ఈ వసూళ్లపై జేఎన్‌టీయూ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

అల్వాల్‌లోని ఓ ప్రైవేట్ ఉద్యోగి కుమారుడికి మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో కన్వీనర్ కోటాలో సీటు లభించింది. ఫీజులు చెల్లించేందుకు పదిరోజుల క్రితం కళాశాలకు వెళ్లగా నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ ఫీజు రూ.22 వేలు చెల్లించాలంటూ తెలిపారు. అంతేకాదు కేవలం నగదు మాత్రమే ఇవ్వాలని షరతు విధించారు. రసీదు మాత్రం రూ.5,500లకే ఇచ్చారు. ఇదేంటని అడిగితే అడ్మిషన్ కావాలా వద్దా అంటూ ఎదురు ప్రశ్నించారు.నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్? గుర్తింపు లభిస్తే కొత్త కోర్సులకు నాణ్యమైన ముద్ర పడినట్లే. ఫీజులు పెంచుకునేందుకు కూడా వెసులుబాటు లభిస్తుంది. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకుని ప్రైవేటు ఇంజినీరింగ్? కళాశాలలు ఎన్‌బీఏ అధికారులను సంప్రదిస్తున్నారు.

ఖర్చులుంటాయిగా అంటూ సమాధానాలు ఎన్?బీఏ అక్రిడిటేషన్? పేరుతో వసూళ్లపై కొందరు తల్లిదండ్రులు, కాలేజీ సిబ్బందిని ప్రశ్నించగా నిర్వహణ ఖర్చులుంటాయిగా అంటూ దురుసుగా సమాధానాలిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం జేఎన్?టీయూ అధికారులు ఒక్కో విద్యార్థి నుంచి రూ.5,500లు వసూలు చేసుకోవాలని మౌఖికంగా ఆదేశించారు. కానీ కొన్ని కళాశాలలు రూ.22 వేల వరకూ వసూలు చేస్తున్నాయి. ప్రైవేటు ఇంజినీరింగ్? కళాశాలల సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్? జి.నాగయ్యను వివరణ కోరగా వివరాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు.

అత్యధికంగా సీబీఐటీకి రూ.1.83 లక్షలు రాష్ట్రంలో 33 ఇంజినీరింగ్? కళాశాలల్లో లక్ష రూపాయలకు పైగా, రెండు కళాశాలలకు లక్ష రూపాయలుగా ఫీజును నిర్ణయించారు. ఈ మేరకు మొత్తం 160 ఇంజినీరింగ్? కాలేజీలకు కొత్త ట్యూషన్? ఫీజులను నిర్ధారిస్తూ విద్యాశాఖ ఇటీవల జీవో జారీ చేసింది. ఈ రుసుములు 2025–28 బ్లాక్? పీరియడ్?కు వర్తిస్తాయి. గత బ్లాక్? పీరియడ్?లో ఫీజు లక్ష రూపాయలు దాటిన కళాశాలల సంఖ్య 33 ఉండగా ఈసారీ అంతే ఉండటం విశేషం. ఫీజు లక్ష రూపాయలు ఉన్న కళాశాలల సంఖ్య అప్పట్లో 7 కాగా ఇప్పుడు 2కి తగ్గింది. అత్యధికంగా సీబీఐటీకి ఫీజు రూ.1.83 లక్షలుగా నిర్ణయించారు. తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ 19 కళాశాలలకు ఇప్పటివరకు ఉన్న ట్యూషన్? ఫీజులను తగ్గించడంతో పాటు 70 కళాశాలలకు ఒక్క రూపాయి కూడా పెంచకుండా ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. దానికి ఆమోదం తెలుపుతూ సర్కారు జీవో జారీ చేసింది. కనీస ఫీజు రూ.45 వేలు ఉండగా 21 కళాశాలలకు ఆ రుసుమును ఖరారు చేశారు.

తాజాగా నిర్ణయించిన ఫీజులు ప్రస్తుత (2025–26) నుంచే అమల్లోకి వస్తాయి. మూడేళ్ల బ్లాక్? పీరియడ్? అంటే 2025–26,2026–27,2027–28 విద్యా సంవత్సరాల్లో బీటెక్? మొదటి సంవత్సరంలో చేరినవారికి ఈ ఫీజులు వర్తిస్తాయి. ఆ విద్యార్థులు 4 ఏళ్ల పాటు అవే రుసుములు చెల్లించాల్సి ఉంటుంది.

19 కళాశాలల్లో తగ్గిన ఫీజులు ఈ ఏడాది 19 కళాశాలలకు ఫీజు తగ్గించారు. అంటే గత విద్యా సంవత్సరం (2024–25) వరకు ఉన్న ఫీజులో టీఏఎఫ్?ఆర్?సీ కోత పెట్టింది. గత ఆగస్టులో ఎప్?సెట్? కౌన్సెలింగ్? సందర్భంగా విద్యార్థుల నుంచి పాత ఫీజులనే వసూలు చేశారు. ప్రభుత్వం కొత్త ఫీజులను నిర్ణయించిన తర్వాత ఒకవేళ తగ్గితే ఆ వ్యత్యాసాన్ని వెనక్కి చెల్లించాల్సి ఉంటుందని సాంకేతిక విద్యాశాఖ అప్పట్లో పేర్కొంది. ఈసారి 19 కళాశాలల్లో ఫీజు తగ్గడంతో అక్కడ సొంతంగా ఫీజు చెల్లించినవారికి ఆయా కాలేజీలు ఆ వ్యత్యాసం మొత్తాన్ని వెనక్కి ఇవ్వాల్సి ఉంటుంది.

## మంత్రి పొంగులేటి ని కలిసిన ఎమ్మెల్యే



**టి మీడియా, ఆగస్టు 8 ,దేవరకద్ర:** మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కలిసి దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించి, ఇందిరమ్మ ఇండ్ల ఎల్ త్రీ సమస్యలను పరిష్కరించాలని, అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో సబ్–రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి సంబంధించిన ఫైనల్ రిపోర్ట్ ఇప్పటికే ప్రభుత్వానికి అందజేయడం జరిగిందని, త్వరితగతిన కార్యాలయాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రివర్యులను కోరిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి .ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ గారి విజ్ఞప్తి పై, మంత్రి వర్యులు శ్రీ. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారని దేవరకద్ర ఎమ్మెల్యే తెలిపారు.

## పనులను పరిశీలించిన భాజపా నాయకులు



**టీ మీడియా, ఆగస్టు 8 ,ఆత్మకూరు:** వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో లోక్ సభ సభ్యురాలు డీకే అరుణ, భాజాప రాష్ట్ర నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి సూచనల మేరకు ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంజూరైన పనులను 8 నెలల లోగా పూర్తి చేసేందుకు కార్యాచరణ అమలుపరచాలని, చేపట్టాల్సిన తొమ్మిది కిలోమీటర్ల అంతర్గత తాగునీటి పైప్ లైన్ పనులతో పాటు అసంపూర్తిగా ఉన్న రెండు కిలోమీటర్ల ప్రధాన పైప్లైన్ పనులను ముమ్మరం చేయాలని ఈ సందర్భంగా భాజపా నాయకులు సంబంధిత అధికారులను కోరారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కొనసాగుతున్న ఈ పథకం పూర్వాపరాలపై స్థానిక పురపాలిక కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి ప్రజల సూచనలు సలహాలు తీసుకోవాలని భాజపా నాయకులు కోరారు. ఈ పథకం పనులు పూర్తి చేయడం ద్వారా పట్టణంలో రాబోయే 40 ఏళ్లలో ఎలాంటి తాగునీటి సమస్యలు ఏర్పడకుండా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఏర్పడిందని వివరించారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే ఉన్న తాగునీటి కులాయిలతోపాటు కొత్తగా మరో 1000 గృహాలకు తాగునీటి కులాయి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నారని తెలిపారు. రూ.17 కోట్ల తో చేపట్టిన ఈ పథకం పనులను వెంటనే పూర్తి చేసేందుకు పూర్తిగా సహకరిస్తామని వివరించారు. ఇట్టి కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆంజనేయులు, ముదిరాజ్ బిజెపి జిల్లా సీనియర్ నాయకులు ఆనంద్. స్థానిక కౌన్సిలర్ భరత్ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షులు సూరి, పార్టీ పట్టణ నాయకులు పుల్లరి రమేష్,బోరెల్లి రాము,దండు రవి, చందు తదితరులు పాల్గొన్నారు.

## మృతదేహంతో కుటుంబసభ్యుల ఆందోళన



**టి మీడియా ,ఆగస్టు 8 , బూర్గంపహాడ్ :** లారీ ప్రమాదంలో మృతి చెందిన ఐటీసీపీఎస్పీడీ కర్మాగారం కాంట్రాక్టు కార్మికుడు గుగులోత్ శ్రీరామ్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ కుటుంబసభ్యులు, బంధువులు శనివారం ఐటీసీ గేటు వద్ద ఆందోళనకు దిగారు. విధులు ముగించుకుని వాహనంపై ఇంటికి వస్తున్న సమయంలో ఐటీసీ సమీపంలో లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొని అక్కడికక్కడే శ్రీరామ్ మృతిచెందాడు.యాజమాన్యం నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన చేపట్టారు. ఈ సంఘటన విషయం తెలుసుకున్న సర్పంచ్ గుగులోత్ కిషోర్నాయక్ ఐటీసీ గేటు వద్ద శ్రీరామ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబానికి అండగా ఉంటానని, ఐటీసీ యాజమాన్యం న్యాయం చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# కన్న తండ్రి కాదు క్రూర మృగం



● కూతురిపై లైంగిక దాడి

**టి మీడియా ,ఆగస్టు 8 , హైదరాబాద్ బ్యూరో:**
కన్న తండ్రి క్రూర మృగంలా మారాడు. కంటికి రెప్పలా కాపాడాల్సిన వాడే పశువులా మారిపోయాడు. కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ అమానీవయ ఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు(45) తన భార్య ముగ్గురు కూతుళ్లతో కలిసి సనత్‌నగర్‌లో హౌస్‌కీపింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మద్యానికి బానిసై తరచూ భార్యా బిడ్డలతో గొడవలు పెట్టుకునేవాడని సమాచారం. కాగా, మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి తన రెండో కూతురిపై కన్నేసి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. కుటుంబం పరువు పోతుందని విషయం బయటకు రాకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్త పడ్డారు. కానీ తండ్రి అరాచకాలు ఆగకపోవడంతో, ఓపిక నశించిన బాలిక సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. దీంతో బాలిక తండ్రిపై పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు.

# శ్రీశైలం ప్రాజెక్ట్ కొనసాగుతున్న వరద



**టి మీడియా ,ఆగస్టు 8 , హైదరాబాద్ బ్యూరో :**
ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్ట్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి శ్రీశైలానికి 2,32,308 క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 876.20 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి నిల్వ 169.46 టీఎంసీలకు చేరింది.
ఈ క్రమంలో అధికారులు కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుదుత్పత్తి చేసి 66,460 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 1,133 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు 8 వేల క్యూసెక్కులు, హంద్రీనీవా ఎత్తిపోతల పథకానికి 875 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాగా, కృష్ణా నదిలో వరద ప్రవాహం పరవళ్లు తొక్కుతున్నా రేవంత్ సర్కార్ కపట నీతితో అన్నదాత కంటనీరు పెట్టుకోవాల్సిన దుర్గతి పడుతున్నది.ద
జూరాల, శ్రీశైలం జలాశయాలు నిండుకుండల్లా తొణికిసలాడుతున్నా ఏపీకి దోచి పెట్టేందుకే తెలంగాణ రైతుల ఆశలను కాంగ్రెస్ నీరుగారుస్తున్నది. ఒకవైపు కృష్ణా, భీమా నదులు పొంగిపొర్లుతూ శ్రీశైలం వైపు పరుగులు తీస్తుంటే రాష్ట్ర సర్కార్ పాలమూరు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నీటిని ఎత్తిపోయకుండా దోబూచులాడుతున్నది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి నాలుగు మోటర్లు సిద్ధంగా ఉన్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో మరో నాలుగు మోటర్లతో కూడా నీటిని ఎత్తిపోయొచ్చు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రెండు ప్రాజెక్టులకు నీటిని వదలకుండా కృష్ణా జలాలను వృథాగా దిగువకు వదిలిపెడుతున్నది.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన బాజపా శ్రేణులు




**టీ మీడియా, ఆగస్టు 8 ,పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన బారతీయ జనతా పార్టీ పట్టణ అద్యక్షుడు కావలి క్రాంతి కుమార్ మాట్లాడుతూ పి హెచ్ సి లో ఇద్దరు డాక్టర్లు ఉండవలసిన చోట ఒక ఏం ఎల్ హెచ్ పీ లతో ఐదుగురు స్టాఫ్ నర్స్ లు ఉండాల్సిన చోట కేవలం ఇద్దరు స్టాఫ్ నర్స్ లతో ఆసుపత్రినీ నడుపు తున్నారు నిత్యం రద్దీగా ఉండే ఈ దవాఖాన కి ప్రతిరోజూ 200 మంది రోగులు హాస్పిటల్ కి వచ్చి వెళ్లడం జరుగుతుంది 35 వేల జనాభా 21 గ్రామాలు నిత్యం రద్దీగా ఉండే నేషనల్ హైవే పై ప్రమాదాల ద్వారా వచ్చే పేషెంట్లు ఇన్ని సమస్యలు ఉన్నప్పటికీ ఏటువంటి డాక్టర్ లేకుండా తగిన సిబ్బంది లేకుండా కనీస పరికరాలు లేకుండా గాలిలో దీపం పెట్టిన మాదిరిగా ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నడపటం సబబు కాదని వీలైనంత త్వరగా సిబ్బందిని పరికరాలని డాక్టర్లని సమకూర్చి పెబ్బేరు మండల కేంద్రానికి సంబంధించిన బీద ప్రజలను దృష్టిలో ఉంచుకొని ఈ సమస్యను పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిఎంహెచ్ఓ ను డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి కంచ ఆంజనేయులు జిల్లా వో బి సి మోర్చా ఉపాధ్యక్షుడు చింతల రామకృష్ణ బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల శివ పట్టణ ప్రధాన కార్యదర్శులు అల్వాల సర్వేశ్వర్ గౌడ్ బలరాం గోనెల అరవింద్ గంధం శివ మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పైపు లైన్ లీకేజీ పట్టించుకోని అధికారులు

**టీ మీడియా, ఆగస్టు 08 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని 9 వ వార్డు పాత అర్ టీ వో ఆఫీసు కు వెళ్ళే దారిలో రోడ్డు గత ఇరవై రోజులుగా పైపు లైన్ లీక్ నామ మాత్రంగా రిపేరు చేయడం మళ్ళీ లీక్ అవుతున్నా పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు ఇప్పటికే ఈ దారిలో సీ సి రోడ్డు బాగోలేక ఇబ్బందిగా ఉంది నీటి లీకెజ్ తో రోడ్డు గుంతల మయంతో ఇబ్బంది గా వుందని నీటి లీకేజీకి శాశ్వత పరిష్కారం చేయాలని వార్డు ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు.



# ఫైవ్ స్టార్ హోటళ్లలో తనిఖీలు

● కిచెన్‌లో కుళ్లిన కూరగాయలు, మాంసం

**టి మీడియా ,ఆగస్టు 8 , బెంగళూరు :**
కర్ణాటక రాజధాని బెంగళూరులోని లగ్జరీ, ఫైవ్ స్టార్ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టగా దారుణ విషయాలు బయటపడ్డాయి. హోటళ్లలో కుళ్లిన కూరగాయలు, మాంసం, ఎక్స్‌పైరీ అయిన పాలు, ఫంగస్ సోకిన ఆహార పదార్థాలు లభ్యమయ్యాయి. పలు హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు ఏమీ పాటించట్లేదనే విషయం వెల్లడైంది. అనేక చోట్ల నిబంధనలు ఉల్లంఘించిన పరిస్థితులే ఉన్నాయి. కర్ణాటకకు చెందిన ఫుడ్ సేఫ్టీ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి చెందిన అధికారులు బెంగళూరు అర్బన్ జిల్లాలోని అనేక స్టార్ హోటళ్లలో తాజాగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి తనిఖీలు నిర్వహించారు.
30 టీంలు ఇందుకోసం పని చేస్తున్నాయి. ఈ విషయాన్ని కర్ణాటక ఆరోగ్య శాఖ మంత్రి యూటీ ఖాదర్ కూడా వెల్లడించారు. తాజ్ యెశ్వంత్‌పూర్, షాంగ్రి లా బెంగళూరు వంటి ప్రముఖ త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లలో తనిఖీలు చేపట్టారు. మొత్తం 26 హోటళ్లను తనిఖీ చేయగా, అనేక చోట్ల తీవ్రమైన ఉల్లంఘనలు కనిపించాయి. సాధారణంగా స్టార్ హెటల్స్ అనగానే.. ఫుడ్ సేఫ్టీ ప్రమాణాలు పాటిస్తారు అనుకుంటారు. కానీ, ఇక్కడ చాలా చోట్ల కనీస ప్రమాణాలు పాటించట్లేదని, పాడైన, ఎక్స్‌పైరీ





డేట్ దాటిపోయిన కూరగాయలు, మాంసం, పాలు, ఇతర తయారు చేసిన పదార్థాలనే వాడుతున్నట్లు తేలింది. ఈ హోటళ్ల నుంచి చికెన్, మటన్, చేపమాంసం, ఆయిల్, పాలు, మసాలాలు, టీ పౌడర్, చీజ్, సాసెస్ వంటి అనేక పదార్థాల శాంపిల్స్ సేకరించి, వాటిని పరీక్షల కోసం ల్యాబొరేటరీకి పంపించారు. అనేక హోటళ్లలో కిచెన్‌లో పారిశుధ్యం లోపించినట్లు గుర్తించారు. అలాగే, కుళ్లిన కూరగాయల్ని వాడుతున్నారు. ఎప్పుడో తయారు చేసిన ఆహార పదార్థాలు పాడైనప్పటికీ వాటిని మళ్లీ వినియోగిస్తున్నారు. కొన్నింటికి ఫంగస్ సోకి ఉంది.
ఆహార పదార్థాల నిర్వహణ, భద్రత కూడా సరిగ్గా లేదు. కొన్ని పదార్థాలపై తప్పుడు లేబుల్స్ ఉన్నాయి. అలాగే, శాకాహార, మాంసాహారాన్ని ఒకే చోట కలిపి ఉంచారు. నిబంధనలకు ఇది విరుద్ధం. వెజ్, నాన్‌వెజ్ ఐటమ్స్ వేర్వేరుగా ఉంచాలి. లలిత్ అశోక్ హోటల్ నుంచి 76 కేజీల మాంసం, 200 కేజీల కూరగాయలు, 32 లీటర్ల పాలు పాడైనట్లు గుర్తించి, వాటిని నాశనం చేశారు. వివాంటా బెంగళూరు, షాంగ్రి లా బెంగళూరు, తాజ్ యెశ్వంత్‌పూర్ వంటి ప్రముఖ హోటళ్లలో కూడా కుళ్లిన మాంసం, కూరగాయలు, పాలు, బేకరి ఐటమ్స్ గుర్తించి ధ్వంసం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన ఈ హోటళ్లు అన్నింటిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు అంటున్నారు.

# ఝార్ఖండ్‌లో పేపర్ లీక్ వివాదం

● విద్యార్థులతో ప్రభుత్వం చర్చలు

**టి మీడియా ,ఆగస్టు 8 , ఢిల్లీ బ్యూరో :**
ఝార్ఖండ్‌లో పబ్లిక్ సర్వీసు కమిషన్ సహా ఇతర నియామక పరీక్షల పేపర్ లీకేజీల వ్యవహారంపై యువత ఆందోళన నేపథ్యంలో సోరెన్ సర్కార్ దిగివచ్చింది. రెండు వారాలుగా రాంచీలో ఆందోళనలు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, ఉద్యోగార్థులతో శనివారం ప్రభుత్వం చర్చలు జరిపింది. అయితే, తమ డిమాండ్లను నెరవేర్చే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని అభ్యర్థులు స్పష్టం చేశారు. దీంతో చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది.
ఇదిలా ఉండగా, అభ్యర్థుల డిమాండ్లు సమంజసమైనవని, వీటిని ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర మంత్రి సంజయ్ ప్రసాద్ యాదవ్ తెలిపారు. ప్రసాద్ యాదవ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. జే ఎం ఎం విద్యార్థి విభాగమైన 'ఝార్ఖండ్ ఛాత్ర మోర్చా' , ప్రభుత్వ కమిటీ ముందు తమ ప్రధాన డిమాండ్లను ఉంచింది. వాటిలో, 14వ ఝార్ఖండ్ సివిల్ సర్వీసెస్ పరీక్షతోపాటు పబ్లిక్ సర్వీస్ కమిషన్ చేపట్టిన అన్ని ఉద్యోగ నియామక పరీక్షలను రద్దు చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగ నియామక పరీక్షల్లో జరిగిన అక్రమాలపై సీబీఐ లేదా ఇతర రాష్ట్రాలకు చెందిన హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆధ్వర్యంలో దర్యాప్తు జరగాలని కోరుతున్నారు.

**అప్పటి వరకు ఆందోళన ఆపబోము**

ఏడు రోజులుగా ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న జిల్కమ్ నాయకుడు దేవేంద్రనాథ్ మహతో వర్గంతోపాటు కాంగ్రెస్ మద్దతు ఉన్న న్సుకి, ఆసీస్, జేసీమ్ ప్రతినిధి బృందాలతో మంత్రులు చర్చలు జరిపారు. సుమారు రెండు గంటల పాటు కొనసాగిన ఈ చర్చల్లో కీలక విషయాల గురించి చర్చించామని, సమావేశంలో పాల్గొన్న




అభ్యర్థి ఒకరు చెప్పారు. "మేం లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు త్వరితగతిన నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే, 14వ పరీక్ష రద్దుతో సహా మా డిమాండ్లన్నీ నెరవేరే వరకు మా ఆందోళనలు కొనసాగుతాయని తెలిపాం" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, రాష్ట్ర మంత్రి దీపికా పాండే సింగ్ మాట్లాడుతూ, చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని, నియామక ప్రక్రియలోని లోపాలు త్వరలోనే పరిష్కారం చేస్తామని తెలిపారు.
విద్యార్థులు రెండు వారాలకు పైగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్నందున, ప్రభుత్వం వారి డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని మహతో పేర్కొన్నారు. ఈ విషయంపై ఎలాంటి జాప్యం చేయకూడదని తెలిపారు. 'శుక్రవారం జరిపిన చర్చల్లో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఉంటే ఈ రోజు ఈ సమావేశం ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉండకపోయేది' అని మహతో వ్యాఖ్యానించారు.

**క్షీణిస్తున్న మహతో ఆరోగ్యం**

మరోవైపు, ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న మహతో ఆరోగ్యం క్షీణించటమే కాకుండా బీపీ, షుగర్ స్థాయిలు పడిపోతున్నాయని వైద్యులు చెప్పినట్లు మంత్రులు తెలిపారు. ఛాతీలో ఇన్‌ఫెక్షన్ ఉన్నందున ఆస్పత్రికి తరలించాలని సూచించినట్లు పేర్కొన్నారు. రిక్రూట్‌మెంటు ప్రక్రియలో సంస్కరణలపై అభ్యర్థుల నుంచి సూచనలు స్వీకరించేందుకు ప్రభుత్వం ఓ ఈ–మెయిల్ ఐడీని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటివరకు పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి 19మందిని అరెస్టు చేశామని, ఏజెన్సీ మాజీచైర్మన్ ఎల్.ఖియాంగ్టేను నాలుగుసార్లు ప్రశ్నించామని అధికారులు తెలిపారు.

**ఆగస్టు 11న రాష్ట్ర అసెంబ్లీ వరకు మార్చ్**

ఇదిలా ఉండగా, ఝార్ఖండ్‌లో పేపర్ లీకేజీలపై 15వ రోజులుగా అభ్యర్థులు చేస్తున్న శాంతియుత నిరసనలు శనివారానికి తీవ్ర రూపం దాల్చాయి. రాంచీలోని హేమంత్ సోరెన్ నివాసం ముట్టడికి యత్నించిన అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) సభ్యులకు, పోలీసులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో 10 మంది ఆందోళన కారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే, నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలకు నిరసనగా ఆగస్టు 11న రాష్ట్ర అసెంబ్లీ వరకు మార్చ్ నిర్వహించాలని ఆ సంస్థ పిలుపునిచ్చింది.

# ఆదివాసి చట్టాల జోలికొస్తే ఖబర్దార్

● ఉద్యోగ రిజర్వేషన్ పై ముఖ్యమంత్రి ప్రకటన చేయాలి

**టీ.మీడియా,ఆగస్టు8,చింతూరు:**
ఏజెన్సీ ప్రాంత చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని 1/70 చట్టం సవర్ణ కోరుతూ సుప్రీంకోర్టు లో పిటిషన్ పై కౌంటర్ పిటిషన్ ప్రభుత్వం దాఖలు చేయాలని ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు అధికారంలోకి వస్తే 100% ఉద్యోగ రిజర్వేషన్ చట్టం చేస్తానని హామీని అమలు చేయాలని కోరుతూ ఈరోజు మన్యం బంద్ సందర్భంగా చట్టాల సవరణ చేయాలని కుతంత్రాలు చేస్తే ఖబర్దార్ అంటూ ఆదివాసీ నాయకులు హెచ్చరించడం జరిగినది. చింతూరు కేంద్రంలో రాష్ట్ర ఏజెన్సీ బంద్ విజయవంతం అయ్యింది మండల వ్యాప్తంగా చింతూరు లక్కవరం ఏడుగురాళ్లపల్లి కేంద్రాలలో ఆదివాసి ప్రజానీకం రోడ్లపైకి వచ్చి ఆదివాసి చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని ఎన్నికల సందర్భంగా ఆదివాసులకు ఇచ్చిన 100% ఉద్యోగ రిజర్వేషన్ హామీని అమలు చేయాలని పోలవరం నిర్వాసితులకు పునరావాసం



పరిహారం చెల్లించాలని 1/70 చట్టం సవరన పిటిషన్పై ప్రభుత్వం ఇంప్లిట్ పిటిషన్ దాఖలు చేయాలని నినాదాలు చేస్తూ ఉదయం నుండి ఆదివాసీలు రోడ్లపై ఆందోళన చేపట్టడం జరిగింది . ఈ ఆందోళన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన స్థానిక జడ్పిటిసి చిచ్చడం మురళి, గిరిజన సంఘం జిల్లా నాయకులు సీసం సురేష్, ఆదివాసి అడ్వకేట్ మడివి రవితేజ మాట్లాడుతూ ఆదివాసీలు అమరవీరులు అనేకమంది త్యాగాలు పోరాటాల ఫలితంగా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతర ప్రజానీకాన్ని కనీసం స్థిరనివాసం కూడా అవకాశం కల్పించకూడదని 1970లో 1/70 చట్టాన్ని రూపొందించారు కార్యక్రమానికి మద్దతుగా సిపిఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్, దళిత సంఘం రాష్ట్ర నాయకులు రవీందర్, మరియు గిరిజన సంఘం నాయకులు మొట్టం రాజయ్య కారం నాగేష్, ఎంపిటీసీ, వేకా రాజ్ కుమార్, కారం సుబ్బారావు, పొడియం లక్ష్మణ్, మడకం చిన్నయ్య, కలముల మల్లేష్, మల్లం సుబ్బమ్మ, సవలం కన్నయ్య, సవలం ధరయ్య సోడే రాములమ్మ, మడకం శారదా సోడా చిన్నమ్మి, భూసం వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.